## క్లుప్తంగా

### 'కల్యాణలక్ష్మి' ఆడపడుచులకు వరం



**అమరచింత:** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఆడపడుచులకు వరంగా మారాయని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో గురువారం 15 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కల్యాణలక్ష్మి లాంటి పథకాల ద్వారా బాల్యవివాహాలు సైతం తగ్గాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, నాయకులు తిరుమలేష్, పోసిరిగారి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

### బైక్, బస్సు ఢీ

**పాన్‌గల్:** ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొన్న ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్‌కు చెందిన శివకుమార్ వైన్ షాపు ఎదుట బైక్‌ను మలుపుతున్న క్రమంలో వెనుక వనపర్తి నుంచి కొల్లాపూర్ వెళ్తున్న కొల్లాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (ప్రైవేటు) బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై వెళ్తున్న శివకుమార్ రోడ్డుపై కిందపడటంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే ప్రథమ చికిత్స అనంతరం ప్రైవేటు వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

### ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



**కొత్తకోట రూరల్:** మండలంలోని పామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ నాయకుడు గిడుగు రామ్మూర్తిపంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం రవి మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధి కోసం కృషి చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు సేవలను కొనియాడారు.

### అర్హులందరికీ ఓటు హక్కు



**ఆత్మకూర్:** 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు నమోదు చేయించాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పూర్తి చేయాలని తహసీల్దార్ రాజు అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆత్మకూర్ మండల బీఎల్‌ఓలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఆసీఫ్, సీనియర్‌అసిస్టెంట్ నాగేంద్రప్రసాద్, బీఎల్‌ఓలు ఉన్నారు.

### బాల్యవివాహాలను నిర్మూలిద్దాం



**అమరచింత:** బాల్యవివాహాలు చేసుకున్నవారంతా నేడు తమ జీవితం కోల్పోయామని బాధపడుతున్నారని జిల్లా బాలల పరిరక్షణ విభాగం వర్కర్ రవిరాజు, డీహెచ్‌ఈడబ్ల్యూ విభాగం కోఆర్డినేటర్ సలోని అన్నారు. మండల కేంద్రంలోని విజేత ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్యవివాహాలు, సాంఘిక దురాచారాలు, ఆన్‌లైన్ అనర్థాల గురించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మాయిలు, అబ్బాయిలు చదువుకునే వయస్సులో ఎటువంటి ఆకర్షణకు గురి కావొద్దన్నారు. అమ్మాయిలు చదువుకునే దశలో హింసకు గురైనట్లయితే వెంటనే 1098, 112 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### బాండ్ల పంపిణీ

**పెద్దకొత్తపల్లి:** టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని యూటీఎఫ్ ఉపాధ్యాయులకు కుటుంబ సంక్షేమ నిధి బాండ్లను గురువారం టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యదర్శులు మహేష్‌బాబు, చంద్రశేఖర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కుటుంబ సంక్షేమ నిధిని ప్రారంభించింది. ఉపాధ్యాయులకు అనుకోకుండా ఏమైనా జరిగినప్పుడు, అకాల మరణం జరిగినప్పుడు వారికి ఆర్థికంగా చేయూతనివ్వడానికి ఎఫ్‌డబ్ల్యూఎఫ్ బాండ్లు ఉపయోగపడుతాయని అన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.6 లక్షల చేయూతను అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మల్లయ్య లక్ష్మీపతి, కర్ణాకర్, నరేష్ పాల్గొన్నారు.

# 65 ఏళ్లు దాటితే ఇంటికే..



పాన్‌గల్‌లో అంగన్‌వాడీ టీచర్ల సమావేశంలో రికార్డులను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ (ఫైల్)

- అంగన్‌వాడీ సిబ్బంది ఉద్యోగ విరమణ వయసు ప్రకటన
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- మండలంలో 13 మంది గుర్తింపు

**పాన్‌గల్:** అంగన్‌వాడీ కేంద్రాల పటిష్టతకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇటీవల పాఠశాలల పరిధి కేంద్రాల్లో ప్రీ స్కూల్ ప్రారంభానికి కార్యచరణ సిద్ధం చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఆయాల్లో 65 ఏళ్ల వయస్సు పైబడిన వారు ఉద్యోగ విరమణ చేయాలంటూ గతంలో ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. దీంతో మండలంలోని 59 అంగన్‌వాడీ కేంద్రాల్లో విరమణ వయస్సు నిండిన టీచర్లు ఒక్కరు, 12 మంది ఆయాలను గుర్తించినట్లు ఐసీడీఎస్ అధికారులు పేర్కొన్నారు.

**మండల పరిస్థితి ఇలా..**

మండలంలోని మంగళ్లపల్లి, కొత్తపేట, రేమద్దుల కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో మంగళ్లపల్లి టీచర్‌కు 65 ఏళ్లు దాటింది. చింతకుంట, దావాజిపల్లి, కిష్టాపూర్, మల్లాయిపల్లితండా, రేమద్దుల, శాగాపూర్‌తండా, గిరిగింజమిట్టతండా, కదిరెపాడు, కేతేపల్లి–1, కేతేపల్లి–3, పాన్‌గల్–1, వెంగళాయిపల్లి కేంద్రాల్లో ఆయాలకు 65 ఏళ్లు దాటినట్లు ఐసీడీఎస్ అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే మండలంలో కొత్తపేట, రేమద్దుల కేంద్రాలల్లో టీచర్లు లేక ఆయాలతోనే నడుస్తున్నాయి. ఇలాంటి కేంద్రాల్లో పనిచేస్తున్న వారు కూడా ఉద్యోగ విరమణ పొందితే వాటి కొనసాగింపు కష్టతరం కానుంది.

**ఉద్యోగ విరమణ బెనిఫిట్**

ఉద్యోగ విరమణ పొందనున్న టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ. 50 వేలు చొప్పున బెనిఫిట్స్ అందించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. దీని ప్రకారమే సంబంధిత అధికారులు ముందుకు వెళ్తున్న క్రమంలో ప్రయోజనం పెంచాలంటూ అంగన్‌వాడీలు ధర్నాలు కూడా నిర్వహించారు. ఈ నేపథ్యంలో టీచర్లకు రూ. 2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష వరకు పెంచనున్నట్లు శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క గతంలో ప్రకటించారు. కానీ అధికారికంగా జీఓ రాలేదని ఐసీడీఎస్ అధికారులు పేర్కొంటున్నారు.

**మండలాల వారీగా..**

| మండలం | కేంద్రాలు | 65 ఏళ్లు పైబడిన | |
|---|---|---|---|
| | | టీచర్లు | ఆయాలు |
| పాన్‌గల్ | 59 | 01 | 06 |
| చిన్నంబావి | 33 | - | 04 |
| వీపనగండ్ల | 30 | 02 | 04 |



పాన్‌గల్ అంగన్‌వాడీ కేంద్రం

### ఆయాలు లేక ఇబ్బందులు



65 ఏళ్లు దాటితే పదవీ విరమణ తీసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో మండలంలో నలుగురు ఆయాలు ఇంటికి వెళ్లే పరిస్థితి ఉంది. దీంతో ఆయా కేంద్రాలల్లో ఆయాలు లేక టీచర్లకు ఇబ్బందులు తప్పవు. ఆయా ఖాళీలను భర్తీ చేసి ఇబ్బందులు తొలగించాలి.

– సుగుణబాయి, అంగన్‌వాడీ టీచర్, వీపనగండ్ల

### ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి



మండలంలో 65 ఏళ్లు దాటిన వారితో పాటు అన్ని ఖాళీలను భర్తీ చేయాలి. కేంద్రాల నిర్వహణలో ఆయాలు లేకపోవడంతో టీచర్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితిని జిల్లా అధికారులకు కూడా నివేదించాం. ప్రభుత్వం స్పందించాలి.

– మాధవి, అంగన్‌వాడీ యూనియన్ మండల నాయకురాలు, పాన్‌గల్

### ప్రభుత్వ ఆదేశాల మేరకు

65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ సిబ్బందిని గుర్తించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మూడు మండలాల్లో ముగ్గురు టీచర్లు, 20 మంది ఆయాలకు 65 ఏళ్లు పూర్తియినట్లుగా గుర్తించాం. ఆయా వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం.

– లక్ష్మమ్మ, ఇన్‌చార్జి సీడీపీఓ, ఐసీడీఎస్ పెబ్బేరు

## సర్వర్ పనిచేయక అన్నదాతల అగచాట్లు

**పాన్‌గల్:** మండల కేంద్రంలోని రైతువేదికలో రుణమాఫీ వర్తించని రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు గురువారం వ్యవసాయాధికారులు సూచించారు. అర్హత ఉన్నా వివిధ కారణాలతో రుణమాఫీ వర్తించని రైతులు దరఖాస్తులతో పాటు రూ.2 లక్షలకు పైబడి అప్పులున్న రైతుల అనుమానాలను కూడా నివృత్తి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. వివిధ గ్రామాల నుంచి దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన రైతులకు సర్వర్ పనిచేయకపోవడంతో చాలాసేపు రైతువేదికలోనే వేచిచూడాల్సిన పరిస్థితి దాపరించింది. మండల నోడల్‌అధికారి, ఏఓ సాజీద్ రహమాన్ మండల కేంద్రంలో రేషన్ కార్డులు లేని లబ్ధిదారుల వివరాలను ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నట్లు నోడల్ అధికారి పేర్కొన్నారు.



పాన్‌గల్ రైతువేదికలో సర్వర్ పనిచేయక ఖాళీగా కూర్చున్న ఏఈఓలు, రైతులు

## ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సాధ్యం కాదు

**వనపర్తి టౌన్:** రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సాధ్యం కాదని, సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగం దళితులకు ఇచ్చిన హక్కులకు విరుద్ధంగా ఉందని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎస్సీల ఐక్యతను దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతుందని, ఎస్సీలు ఐక్యతతో ఉమ్మడిగా పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత దళిత జనాభాకు అనుగుణంగా 15 శాతం రిజర్వేషన్‌ను 20 శాతానికి పెంచి దళిత హక్కులను కాపాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సహదేవుడు, నాయకులు బాలస్వామి, వెంకటేష్, నాగరాజు, రఘురాం, కృష్ణయ్య, మధుసూదన్, రాఘవేందర్, సురేష్, శివ, కుమార్, ఓంప్రకాష్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో ఆరుద్ర పూజలు

**కొత్తకోట రూరల్:** మండలంలోని కానాయపల్లి శివారులో గల దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఏకరుద్రాభిషేక పూజలు నిర్వహించారు. పరమశివుడి జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా ఆలయంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు జరిపించారు. శ్రావణమాసం ఏకాదశి, ఆరుద్ర నక్షత్రం కలిసి రావడంతో పవిత్రమైన రోజుగా భావించి భక్తులు ఉదయం నుంచి అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని శివలింగానికి పాలాభిషేకం చేసి మొక్కలు తీర్చుకున్నారు. అంతకు ముందు మహామృత్యుంజయ సహిత ద్వాదశ జ్యోతిర్లింగాలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.



# ఎన్నికల హామీలు అమలు చేయాలి



పాన్‌గల్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు



కొత్తకోటలో..

**కొత్తకోట రూరల్:** సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పక నెరవేర్చాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం కొత్తకోట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ ఎం.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.2లక్షల రుణం తీసుకున్న రైతులందరికీ జీఓ నంబర్ 567ను సవరించి రేషన్ కార్డుతో సంబంధం లేకుండానే రుణమాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నిక్సన్, వెంకటయ్య, చెన్నయ్య, నర్సింహ, కుర్మన్న, వెంకటేష్, కృష్ణయ్య, బాలయ్య, శివ, నాగన్న, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

**పెద్దమందడిలో..**

అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పెద్దమందడి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు, పరమేశ్వరాచారి, లక్ష్మణ్‌నాయక్, మన్నెం, రూప్‌సింగ్, వెంకటమ్మ, జానకి, ఈశ్వర్, వినయ్, మన్నెమ్మ తదితరులు ఉన్నారు.

**ఆత్మకూర్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ రైతులందరికీ వర్తింపజేయాలని గురువారం స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు వద్ద రైతులతో కలిసి సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యాదర్శి ఎస్ రాజు, రాములు, విశ్వనాథం, మన్యం, వెంకటన్న, కిష్టన్న, నారాయణ, అశోక్, శ్రీను, రైతులు ఉన్నారు.

**మదనాపురం:** రుణమాఫీ కానీ రైతులకు ఒకేసారి రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలనీ కోరుతూ గురువారం తహసీల్దార్ అబ్రహంలింకన్‌కు సీపీఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండ్ల రాజు, వెంకట్రాములు, బొబ్బిలి నిక్సన్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

**వీపనగండ్ల:** రైతులు బ్యాంకు ద్వార తీసుకున్న రుణాలను వెంటనే మాఫీ చేయాలని కోరుతూ సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకుల ద్వార అప్పు తీసుకున్న ప్రతి రైతు రుణాన్ని ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేయాలని పార్టీ మండల కార్యదర్శి బాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన పలు హామీలను వెంటనే అమలు చేయాలని రైతు భరోసా పథకం ద్వార అందించాల్సిన ఆర్థిక సహాయాన్ని వెంటనే రైతుల ఖాతాల్లో వేయాలని ఆయన అన్నారు. కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వెంటనే చేపట్టాలని కోరుతూ తహసిల్దార్ వరలక్ష్మికి ఒక వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, మహబూబ్‌పాష, బాలగౌడ్, వెంకటయ్య, ఖాజా ఉస్సేన్, రవిప్రసాద్, వెంకటేశ్వర్ల గౌడ్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

**పాన్‌గల్:** రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏలాంటి షరతులు లేకుండా రూ. 2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బాల్యనాయక్ అన్నారు. గురువారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. రుణమాఫీ విషయంలో పలు నిబంధనల పేరుతో చాలా మంది రైతుల రుణాలు మాఫీ కాక చాలా ఇబ్బందులు పడుతున్నార న్నారు. సర్వేల పేరుతో రైతులకు నేటికి రైతు భరోసా అందించలేదన్నారు. ప్రభుత్వం స్పందించి షరతులు లేకుండా అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని, రైతు భరోసా వెంటనే మంజూరు చేయాలన్నారు. రుణమాఫీ నిబంధనాలను తొలగించడం, రైతు భరోసాను మంజూరు చేయకపోతే రైతులు, రైతు సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ సుభాష్‌నాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు భాస్కర్, పార్టీ నాయకులు భగత్, వెంకటయ్య, జంబులయ్య,రైతులు పాల్గొన్నారు.

**అమరచింత:** రైతులకు ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం యూనియన్ బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం బ్యాంకు మేనేజర్ శివశంకర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి, వెంకటేష్, అజయ్, రమేష్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

**వనపర్తి రూరల్:** ఎలాంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పుట్టా ఆంజనేయులు కోరారు. గురువారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్ విజయసింహకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మేకల ఆంజనేయులు, లక్ష్మి, పరమేశ్వరాచారి, ఉమ, కవిత, నందిమల్ల రాములు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యల పరిష్కారానికి పనిచేద్దాం



విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**పాన్‌గల్:** మండలంలోని కేతేపల్లి వాసి డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికై న మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డిని గురువారం శివరామభక్తాంజనేయస్వామి కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరెన్నో పదువులు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

**వీపనగండ్ల:** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పనిచేస్తుందని, అందుకు అందరం సహకరించాలని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు ఆయనను కలిసి రైతుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటునందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డిని వారు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పోతుల వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, అల్వారు వెంకటేశ్వర్‌రెడ్డి, కుర్మయ్య, సుబ్రహ్మణ్యం ఆచారి, గంగులు, రఘు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం



కంభళాపురంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

**ఆత్మకూర్:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశాభివృద్ధి పరుగులు పెడుతుందని, బీజేపీలో సభ్యత్వాలు తీసుకుని పార్టీని మరింత బలోపేతం చేయాలని రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు కనకరాజు, జిల్లా ప్రధానకార్యదర్శి అశోక్‌జీ, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మేర్వరాజు అన్నారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులో మండల, పట్టణ బీజేపీ నాయకుల సమావేశాలు వేర్వేరుగా నిర్వహించారు. సెప్టెంబర్ 1 నుంచి బీజేపీ సభ్యత్వాలు ప్రారంభవుతున్నాయని, బూత్‌లెవల్ బాధ్యులు 88000 02024 నంబరుకు డయల్‌చేసి సభ్యత్వాలు నమోదు చేయించాలని సూచించారు. గతంలో కంటే అధిక శాతంలో సభ్యత్వాలు జరిగే విధంగా సీనియర్ నాయకులు కృషి చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, ఎల్లన్న, మాసన్న, భగవంతురెడ్డి, అశోక్, సురేష్, తమ్మలి విజయ్, లక్ష్మీనారాయణ, బాలకృష్ణ, రాము, సూరి ఉన్నారు.

**వనపర్తి రూరల్:** శ్రీరంగాపురం మండలంలో భారీగా పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టాలని బీజేపీ వనపర్తి నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ స్థానిక నాయకులకు దిశానిర్దేశం చేశారు. మండలంలోని కంభాళాపురంలో బీజేపీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో మండల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి శివ, విరాట్, రాజేష్, శివ, నరేష్, శివరాజ్, మధు తదితరులు పాల్గొన్నారు.

**స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి**

**అమరచింత:** త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ తన సత్తాచాటేందుకు సిద్ధంగా ఉందని బీజేపీ సభ్యత్వ నమోదు కన్వీనర్లు కర్నె స్వామి, బలరాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన మండల స్థాయి బీజేపీ నాయకుల సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్, మండల అధ్యక్షుడు హరీశ్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వ రాజు, అశోక్‌కుమార్, వెంకటేశ్వర్లు, నరాల నారాయణ పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు

**వీపనగండ్ల:** ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు భానుప్రకాశ్ సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఆయన సందర్శించారు. చదువుల్లో వెనకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠశాల రికార్డుల నమోదులో తప్పులు దొర్లకుండా చూసుకోవాలన్నారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోకపోతే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు. కూరగాయలు, తాగునీరు తదితర వాటిపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కల్పన, పారిజాత, రాధిక, మమత, సీఆర్పీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ ఈఓ, ఎంఈఓ పదోన్నతులు కల్పించాలి



ఉపాధ్యాయులకు సభ్యత్వం ఇస్తున్న జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి

**వనపర్తి రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం ఏకీకృత సర్వీస్ నిబంధనను పాటించి డిప్యూటీ ఈఓ, ఎంఈఓ, జూనియర్ లెక్చరర్, డైట్ లెక్చరర్ పదోన్నతులు ఇవ్వాలని తపస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి అన్నారు. పెబ్బేరు, శ్రీరంగాపురం మండలంలో తపస్ నాయకులు గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 5 డీఏలతో పాటు పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, కేజీబీవీ ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఉద్యోగ భద్రతను కల్పిస్తూ మినిమం టైం స్కేల్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, జిల్లా సాంస్కృతిక కన్వీనర్ సుదర్శన్, జిల్లా మీడియా కన్వీనర్ శశివర్ధన్, మండల అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కృష్ణుడి శోభాయాత్ర



చర్లపల్లిలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు, ప్రభోద సేవాసమితి సభ్యులు

**కొత్తకోట రూరల్:** శ్రీకృష్ణాజన్మాష్టమిని పురస్కరించుకొని త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని రాఘవేంద్ర ఆలయం వద్ద ఈనెల 26నుంచి శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు రోజుల పాటు వైభవంగా పూజలు అందుకున్న శ్రీకృష్ణుడిని గురువారం పల్లకీలో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అదేవిధంగా కొత్తకోట మండలంలోని చర్లపల్లిలో శ్రీకృష్ణుడి ఉత్సహా విగ్రహాన్ని గ్రామస్తులు, ప్రభోద సేవా సమితి సభ్యులు ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో విజయభాస్కరెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, పురుషోత్తం, శేఖర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మొగులన్న, లక్ష్మన్న, రాఘవేంద్రచారి, శైలజ, జ్యోతి, శంకరమ్మ, ప్రమీల, మంజుల, లయ ఉన్నారు.

## ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి



మామిడిమాడ పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు

**వనపర్తిటౌన్:** ఒలంపిక్‌లో భారత్‌కు స్వర్ణ పతకాలు అందించిన ధ్యాన్‌చంద్ క్రీడా చరిత్ర చెరగనిదని మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలుస రమేష్‌గౌడ్, కవులు గిరిరాజాచారి, డాక్టర్ నరసింహశర్మ, బాలేమియా, నరసింహ, శివుడు, వెంకట్, వెంకటశెట్టి పాల్గొన్నారు.

**వనపర్తి రూరల్:** మండలంలోని కడుకుంట్ల ఉన్నత పాఠశాలలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నిరంజన్‌గౌడ్, ఉపాధ్యాయులు బాలరాజు, రాజేంద్రబాబు, జ్యోతినాయన నంద, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఖిల్లాఘనపురం:** జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని మామిడిమాడ ప్రాథమిక పాఠశాలలో గురువారం క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ వారు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వాస రాఘవేందర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చెన్నప్ప, క్లబ్ ట్రెజరర్ రాఘవేందర్, సాయి లీల, చాంద్‌పాష, హెచ్‌ఎం రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి ఫీవర్ సర్వే



**పాన్‌గల్:** వైద్య సిబ్బందికి కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉంటూ జ్వర పీడిత సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీటకజనిత వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ వ్యాధుల నివారణ, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.